

అఖిలాండకోటి భక్తజనం కన్నీరు పెట్టింది. తిరుపతి నగరం దుఃఖ సముద్రంగా మారిపోయింది. వైకుంఠద్వార దర్శనాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చి అశువులుబాసిన వారిని చూసి గుండె పగిలేలా ఏడ్చింది. బుధవారం రాత్రి బైరాగిపట్టెడ పార్క్ ప్రధాన గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన ఆరుగురి మృతదేహాలున్న.. రుయా మార్చురీ ప్రాంతం ఏడుపులతో నిండిపోయింది. గాయపడిన వారున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రి.. నాయకుల పరామర్శలతో కిక్కిరిసింది. ఏర్పాట్లలో వైఫల్యమా? భక్తోత్సాహపు ఆత్రుతా? నిర్వహణ లోపమా?.. కారణాలు ఏవైనా కన్నుమూసింది మాత్రం అమాయకపు, సాధారణ భక్తజనం. లక్షల పరిహారాలు.. పోయిన ప్రాణాలను వెనక్కి తీసుకురావు. విపక్షపు నిందలు.. ఓదార్పునివ్వవు. వైకుంఠద్వారాల్లోంచి స్వామి దర్శనం కోసం వచ్చి విగతజీవులైన తమవారి దేహాలతో కుటుంబసభ్యులు స్వస్థలాలకు పయనమయ్యారు.



మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం

రెండు గంటల్లోనే పోస్టుమార్టం పూర్తిచేసి స్వస్థలాలకు మృతదేహాల తరలింపు

డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డి సస్పెన్షన్

ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్ బదిలీ

తొక్కిసలాట ఘటనపై **న్యాయ విచారణ**

తిరుపతి కన్నీరు పెట్టిన వేళ...





చంద్రబాబు ఓదార్పు



పవన్ కల్యాణ్ పరామర్శ



జగన్ పలకరింపు



మంత్రుల భరోసా

మనసు కలత చెందింది

తిరుపతి సంఘటన నా మనసును కలిచివేసింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయాలకతీతంగా వెంకన్నకు సేవ చేస్తున్నా మన్న భావనతో అందరం ముందుకెళ్లాలి. అధికారయంత్రాంగం సమన్వయంతో ఇలాంటి అపశ్రుతులు జరగకుండా జాగ్రత్త పడాలి. ఇటువంటి సంఘటనలు ఇక జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- సీఎం చంద్రబాబు

క్షమించండి !

ఈ ఘటనకు శ్రీవారి భక్తుల్ని, రాష్ట్ర ప్రజల్ని, హైందవ ధర్మాన్నీ.. ఇలా ప్రతి ఒక్కరినీ క్షమించమని ప్రభుత్వం తరుపున కోరుతున్నా. తప్పు జరిగిందని తప్పించుకోవడంలేదు. బాధ్యత తీసుకుంటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక కూడా లేదు. అధికారులు చేసిన తప్పులకు మేము తిట్లు తింటున్నాం. టీటీడీలో ప్రక్షాళన మొదలుకావాల్సిన అవసరం ఉంది.

- డిప్యూటీ సీఎం పవన్

ప్రతిష్ట దిగజార్చారు

టీటీడీ పరువు ప్రతిష్ఠను దిగజార్చింది చంద్రబాబు ప్రభుత్వమే. టీటీడీ ఛైర్మన్, ఉన్నతాధికారులతో పాటు బాబు కూడా బాధ్యుడే. కుప్పం పర్యటనకు పోలీసులను తరలించి, ఇక్కడ ప్రత్యామ్నాయం చూడకపోవడం కూడా తప్పిదమే. సీఎం పర్యటనకు ఇచ్చిన ప్రాధాన్యత భక్తులకు ఇవ్వలేదు. ఇది ఓ బ్లాక్ మార్క్‌లా నిలిచిపోతుంది.

- మాజీ సీఎం జగన్

తిరుపతి, జనవరి9(ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురి మృతి నేపథ్యంలో గురువారం తిరుపతి నగరం ఉక్కిరి బిక్కిరి అయ్యింది. సీఎం, డిప్యూటీ సీఎం, విపక్ష నాయకుడు, మంత్రుల రాకతో ఘటన జరిగిన బైరాగిపట్టెడ ప్రాంతం, క్షతగాత్రులున్న స్విమ్స్ పద్మావతి ఆసుపత్రుల ప్రాంగణం ఓదార్పులతో హోరెత్తిపోయింది. ఉదయం ఎనిమిదింటికే మంత్రుల బృందం రుయా ఆస్పత్రికి చేరుకుంది. హోం మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రుయా మార్చురీవద్ద విలపిస్తున్న మృతుల బంధువులను ఓదార్చారు. దగ్గర ఉండి మృతదేహాలను వారి స్వస్థలాలకు అధికారులను వెంట ఇచ్చి పంపించారు.

చంద్రబాబు ఆగ్రహం

మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు బైరాగపట్టెడలోని పద్మావతి పార్కుకు చేరుకుని ఘటనా స్థలానికి పరిశీలించారు. అక్కడే ఉన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని తప్పుగా అభివర్ణించారు. అక్కడనుంచి నేరుగా మధ్యాహ్నం 2.40 గంటలకు స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. దాదాపు గంటకు పైగా వారితో పాటు బంధు మిత్రులతో మాట్లాడారు. సంఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. దురదృష్టకర ఘటనపై చింతించారు. ఆతర్వాత టీటీడీ పరిపాలన భవనంకు చేరుకుని తొక్కిసలాట ఘటనపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్‌లను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ రమణకుమార్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. మీడియా సమావేశం అనంతరం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో తిరిగి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు పయనమయ్యారు.

మండిపడ్డ పవన్

సీఎం చంద్రబాబు టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఉండగానే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు తిరుపతి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా తొక్కిసలాట చోటు చేసుకున్న బైరాగిపట్టెడ ప్రాంతంలోని పద్మావతి పార్క్, రామానాయుడు పబ్లిక్ స్కూల్ పరిసరాలను పరిశీలించారు. అక్కడ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు ఆనంద సాయితో పాటు అధికార యంత్రాంగంతో చర్చించారు. ప్రమాదానికి గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సాయంత్రం 4.20గంటలకు స్విమ్స్‌కు చేరుకొని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి గాయాలైన వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. చికిత్స పొందుతున్నవారినీ, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆస్పత్రి బయటకువచ్చి మీడియాతో మాట్లాడారు. టీటీడీ, పోలీస్ అధికారుల వైఫల్యాలపై మండిపడ్డారు. తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ క్షమించమని వేడుకున్నారు.

జగన్ హడావుడి

పవన్ మీడియాతో మాట్లాడుతుండగా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తన అనుచరగణంతో ఆస్పత్రికి చేరుకున్నారు. ఈసందర్భంగా వైసీపీ శ్రేణులు నానా యాగీచేయడంతో విమర్శలకు గురయ్యారు. తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండు చేశారు.



కుట్రకోణంపై పవన్ అనుమానాలు

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటపై కుట్రకోణాలు దాగివుందని వస్తున్న అనుమానాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లేవనెత్తారు. ముఖ్యంగా పోలీసుల వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. అంతేకాకుండా స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పవన్ పరామర్శించి బయట మీడియాతో మాట్లాడుతుండగా అప్పుడే జగన్మోహన్ రెడ్డితో పాటు వైసీపీ ముఖ్యనేతలను పోలీసులు ఆసుపత్రి లోపలకు అనుమతించడంపై పవన్ తప్పుబట్టారు. ఉద్విగ్న పరిస్థితుల నేపథ్యంలో ఒక నాయకుడు పర్యటనకు వచ్చినప్పుడు ఆదేస్థానానికి మరో నాయకుడిని ఎలా అనుమతిస్తారని పవన్ ప్రశ్నించారు. ఇదేదో ఉద్దేశ్యపూర్వంగా చేస్తున్నట్టు కనిపించందని తిరుగు ప్రయాణంలో విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వద్ద ఈ అంశంపై మాట్లాడారు.



ఘటన జరిగిన టోకెన్ల జారీ కేంద్రంలో చేసిన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం

తిరుమలలో వైకుంఠ శోభ



వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల వెంకటేశ్వర ఆలయం ఉత్తరద్వార దర్శనానికి సిద్ధమైంది. ఇందుకోసం సర్వాంగ సుందరంగా ఆలయాన్ని అలంకరించారు. గురువారం అర్ధరాత్రి దాటాక వైకుంఠనాథుడి దర్శనానికి ఆలయ ద్వారాలు తెరిచారు. శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

- వివరాలు 6లో -

మెగా రుణమేళాలో రూ.10కోట్లు చెక్కుల పంపిణీ



మహిళా సంఘాలకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

రామచంద్రాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వెలుగు ఆధ్వర్యంలో మెగా రుణ మేళా నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 70 మహిళా స్వయం సంఘాలకు రూ.10కోట్ల మేర రుణాల చెక్కును అందజేశారు. అనంతరం శోభన్‌బాబు మాట్లాడుతూ బ్యాంకు రుణాలు తీసుకున్న డ్వాక్రా సభ్యురాలు క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు సప్తగిరి గ్రామీణబ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజరు కిషోర్ పట్నాయక్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు రుణాలను సకాలంలో చెల్లిస్తున్నందున రుణపరిమితిని కూడా రూ.50లక్షల వరకు పెంచి ఇస్తామన్నారు. ఎంపీడీవో ఇందిర, టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, జనార్దనచౌదరి, రావిళ్ల గిరినాయుడు, నీలకంఠచౌదరి వెలుగు ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మబోధనలో మేటి మహాభారతం


డాక్టర్ మోహిద్దీన్ బాషాను సన్మానిస్తున్న అతిథులు

పాకాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధర్మాన్ని బోధించడంలో మహాభారతం గొప్ప గ్రంథమని యోగి వేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, ప్రాశ్చ్య పరిశోధన సంస్థ, మాడభూషి సాహిత్య కళాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మహాభారతం-శాస్త్ర విజ్ఞానంపై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ పాలకులు, తల్లిదండ్రులు, గురువులు, విద్యార్థులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించడమే ధర్మమన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ ద్రోణుడు, కుంభ సంభవుడుగా జన్మించడం టెస్ట్యూబ్ కల్చర్ విధానమన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా మాట్లాడుతూ ఏమిచేయాలి, ఏమి చేయకూడదనే విషయాలు మహాభారతం నేర్పిస్తుందన్నారు. డాక్టర్ హరినాథ్, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వాసు, ఈశ్వరబాబు, వెంకటకృష్ణయ్య, రమేష్‌కుమార్, మోహన్ బెహరా, మాశిలామణి, చిట్టికళావతి, మాదవి, రవణమ్మ, భరణీనాథరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ



పాకాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల రీసర్వేకు సంబంధించి మండలంలోని తోటతిమ్మయ్యగారిపల్లెను పైలెట్ గ్రామంగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సంతోష్‌సాయ్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజుకు 20 ఎకరాల చొప్పున గ్రామ పరిధిలోని భూములను సర్వే చేస్తామన్నారు. రీ సర్వే డీటి కళ్యాణ్, సర్వేయర్ వాసుదేవరెడ్డి, వీఆర్వో యూసఫ్, గ్రామపెద్దలు శ్రీనివాసులు నాయుడు, సిద్దయ్య నాయుడు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



పాకాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం పాకాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగుల రంగుల రంగవల్లులు వేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామ్ చెప్పారు. పోటీల్లో పాల్గొన్న 52 మంది విద్యార్థినులకు కన్సొలేషన్ బహుమతులు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. విద్యార్థులకు సీడ్ బాల్స్ అందజేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కుప్పుస్వామి నాయుడు, జి.రామయ్య, జీవిప్రసాద్, కెఎస్.మస్తాన్, ప్రధానోపాధ్యాయులు నాగరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూలు వార్షికోత్సవం

చంద్రగిరి,జనవరి 9(ఆంధ్రజ్యోతి): తొండవాడ వద్ద బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ 9వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ సీఎస్ఆర్ కృష్ణమూర్తి, అంతర్జాతీయ పిస్టల్ షూటర్ సుమేద్ కుమార్ దేవ్జాలివాలా, అంతర్జాతీయ రైఫిల్ షూటర్ ప్రతీక బోర్స్, డాక్టర్ శ్రావణ్ కృష్ణారెడ్డి, స్కూల్ డైరెక్టర్ శ్రీవాత్సవలు హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వీణావాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే క్యాంప్‌లో వెటర్నరీ విద్యార్థికి కాంస్య పతకం


వెటర్నరీ విద్యార్థి అంజలి హార్స్ రైడింగ్

తిరుపతి రూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక క్యాంప్‌లో తిరుపతి ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థి జి.అంజలి (ఎన్‌సీసీ క్యాడెట్) హార్స్‌రైడింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈమె కాంస్య పతకాన్ని సాధించిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్న ఈపోటీల్లో తమ విద్యార్థి పతకాన్ని సాధించడం సంతోషంగా ఉందన్నారు. రెండేళ్లపాటు అంకుఠిత దీక్షతో సాధన చేసి ఈ విజయాన్ని సాధించిందని అభినందించారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ రమణ, చందు

తిరుపతి రూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామపంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.11లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ డీవీరమణతో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చందు కలసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని చందు తెలిపారు. పంచాయతీలోని రాజు కన్వెన్షన్ మార్గంలో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి టి.శ్రీలేఖ, ఏఈ ఉదయ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, టీడీపీనేతలు పాల్గొన్నారు.

చంద్రగిరి

నేడు మండల సర్వసభ్య సమావేశం

చంద్రగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి):: మండల సర్వసభ్య సమావేశంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

శ్రీగాయత్రి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నీరజాక్షులనాయుడు తదితరులు

తిరుపతి రూరల్, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యార్థిజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీపరీక్షల్లో తాటితోపులోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరు అవార్డులు, సర్టిఫికెట్లు పొందారని కాలేజి కరస్పాండెంట్ నీరజాక్షులునాయుడు పేర్కొన్నారు. విద్యార్థులు ఎం.జాహ్నవి, డి.అభినయ, ఎం.బిందులక్ష్మి, వి.గాయత్రి, జి.స్వాతి, ఎస్.హరిచరణ్‌రెడ్డి, బి.మునిలోకేష్‌లు ప్రతిభా అవార్డులు అందుకున్నారని అభినందించారు. డైరెక్టర్ సి.కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న సేవలో నందమూరి రామకృష్ణ



నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మావతీ దేవి సమేత కల్యాణ వెంకన్న సేవలో దివంగత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కొనసాగిన అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండులో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా గురువారం కూడా 26వ వారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, తేజ, పేట చిరంజీవి, వెంకటరమణయాదవ్, లక్ష్మణ్, ప్రదీప్‌కుమార్, హేమంత్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పేరుతో భారీ కుంభకోణం: సుధీర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): జగనన్న కాలనీ పేరుతో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్‌రెడ్డి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఎమ్మెల్యే సుధీర్ ఆరోపించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని హౌసింగ్ లేఅవుట్‌లో గురువారం భూ సేకరణ, ఇంటి పట్టాల పంపిణీపై విచారణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ ... మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తామని మభ్యపెట్టి ప్రజాధనాన్ని గత పాలకులు లూటీ చేశారన్నారు. అప్పటి ముఖ్య మంత్రి జగన్ చేతుల మీదుగా ఊరందూరు లేఅవుట్‌లో అత్యంత ఆర్భాటంగా ప్రారంభించి నప్పటికీ ఇళ్ల నిర్మాణంపై మాత్రం చిత్తశుద్ధి చూపలేదన్నారు. భూసేకరణలో అప్పటి ఎమ్మెల్యే మధు పెద్దఎత్తున స్కాంకు పాల్పడ్డారన్నారు. అలాగే కాలనీలో రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల పేరుతో కోట్ల రూపాయలను స్వాహా చేశారన్నారు. అన్ని అంశాలపై నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యే వినతిపత్రాలు స్వీకరించారు. కొందరు మహిళలు తమకు పట్టాలు ఇచ్చారుకానీ స్థలాలు చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైకుంఠనాథుడిని చూతము రారండి..




బలిపీఠానికి పుష్పాలంకరణ- ముస్తాబైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

చంద్రగిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. తిరుమల శ్రీవారిని సందర్శించుకోలేని వారి కోసం ఆలయంలో వైకుంఠద్వారం ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజామున 12.05 నుంచి 2.30 గంటల వరకు తిరుపళ్లచ్చితో శ్రీవారిని మేల్కొలి, తోమాలసేవ, కొలువు, తదితర సేవలను నిర్వహించారు. వేకువజామున 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రాత్రి కైంకర్యాలు నిర్వహించి, 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సర్వదర్శనానికి అనుమతించనున్నారు. చలువ పందిళ్ళు, బారికేడ్లు, క్యూలైన్లు, పెయింటిగ్, వాహనాల పార్కింగ్, సమాచార ఫ్లెక్సీల బోర్డులను ఏర్పాటు చేశారు. హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

శ్రీనివాసమంగాపురంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సీఐ సుబ్బరామిరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఆయన సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. తిరుపతి ఘటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మదనపల్లె, పీలేరు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె మీదుగా జాతీయ రహదారిలో పంపించాలన్నారు. తిరుపతి నుంచి శ్రీనివాసమంగాపురం వెళ్ళే వాహనాలు తొండవాడ నుంచి జాతీయ రహదారిలో ఐతేపల్లె, ఎ.రంగంపేట మీదుగా వెళ్ళేలా చూడాన్నారు. తిరుపతి నుంచి దర్శనానికి వచ్చే వాహనాలను కాలూరు, తిరుపతి సర్కిల్ వద్ద పార్కింగ్ చేయాలన్నారు. చంద్రగిరి నుంచి వచ్చే వాహనాలను మిట్టపాలెం వద్దనే పార్కింగ్ చేయాలని సూచించారు.

భాకరాపేట: చిట్టేచెర్ల నగిరి వైకుంఠపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు


గీతాంజలి పాఠశాలలో వేడుకలు

భాకరాపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ గిరికుమార్‌రెడ్డి, హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బూడ్లింగ్ బడ్స్ స్కూల్లో ...

చంద్రగిరి: స్థానిక బూడ్లింగ్ బడ్స్ స్కూల్లో గురువారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూల్ ఆవరణలో గ్రామీణ సంప్రదాయ వాతావరణం ఉట్టిపడేలా పచ్చ తోరణాలు, పందెళ్ళు వేసి రంగువల్లులు వేశారు. గొబెమ్మలు ఏర్పాటు చేసి బోగి మంటలు వేశారు. స్కూల్ ఛైర్మన్ హితేంద్రనాధ్‌రెడ్డి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

తిరుమలలో ప్రశాంతంగా స్థానికులకు టోకెన్ల జారీ



టోకెన్ల కోసం క్యూలో తిరుమల స్థానికులు - టోకెన్ల జారీ ప్రక్రియ

తిరుమల, జనవరి9(ఆంధ్రజ్యోతి): స్థానికుల కోసం తిరుమలలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్ల ద్వారా గురువారం వేకువజాము 4.50 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రక్రియను టీటీడీ మొదలుపెట్టింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలను దృష్టిలో పెట్టుకుని తిరుమలలోని కౌంటర్ల వద్ద పోలీసు బందోబస్తును భారీగా ఏర్పాటు చేశారు. ఆధార్‌లో తిరుమల అడ్రెస్ ఉన్నవారినే క్యూలైన్‌లోకి అనుమతించారు. క్యూలైన్ పలుచగానే కనబడింది. రాత్రి ఎనిమిది గంటల వరకు టోకెన్లు సులభంగా పొందారు. రాత్రి 7 గంటల సమయానికి ఏకాదశి, ద్వాదశికి సంబంధించి 1,711 టోకెన్లను జారీ చేశారు.

ఏకాదశికి ముస్తాబైన కల్యాణ వెంకన్న ఆలయం

రేపు ద్వాదశి దర్శనం



నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైకుంఠ ఏకాదశి రోజున శుక్రవారం పద్మావతీ దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం టీటీడీ అధికారులు ఆలయంలో చలువ పందిళ్ల వేసి, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 5.00 నుంచి 6.30 గంటల వరకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి, 7 గంటల వరకు సర్వదర్శనం కల్పిస్తారని ఆలయాధికారి నాగరాజు తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆలయాలలో సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజునా వైకుంఠ ద్వారం తెరుస్తున్నారని, అయితే ఒక్క నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో మరుసటి రోజు అంటే ద్వాదశి రోజు వైకుంఠ వాకిలి తెరచి, భక్తులకు వైకుంఠ ప్రాప్తి కలుగు జేస్తారని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్యా తెలిపారు. వైకుంఠ ద్వాదశి రోజు అనగా 11 వ తేది శనివారం వైకుంఠ ద్వారం తెరుస్తున్నారని, ఉదయం 8.40 గంటల నుంచి 11.30 గంటల వరకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు.

రేణిగుంట: మండలంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయాల్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. విద్యుదీపకాంతులతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

దేశాభివృద్ధికి ప్రవాస భారతీయులు తోడ్పాటు అందించాలి


సదస్సును ప్రారంభిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మన దేశ బహుముఖ అభివృద్ధికి ప్రవాస భారతీయులు తోడ్పాటు అందించాల్సిన అవసరముందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. ప్రవాస భారతీయ దివస్ సందర్భంగా ప్రముఖ అమెరికన్ తెలుగు ఎన్‌ఆర్‌ఐ సంస్థ పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరీ హాల్లో గురువారం ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేసింది. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన దత్తాత్రేయ మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన వారు మాతృ దేశ అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. దేశాభివృద్ధికి సహకారం అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐలకు ఆత్మీయ సంస్థ మంచి వేదిక అని అన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులకు ఆత్మీయ సంస్థ ఒక స్ఫూర్తిని కలుగజేస్తుండడం అభినందనీయమన్నారు. క్యూబాకు చెందిన భారత మాజీ రాయబారి రాజశేఖర్ మాట్లాడుతూ ఎంతో మంది ఎన్‌ఆర్‌ఐలు దేశాభివృద్ధికి తోడ్పడటం మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. మేఘాలయకు చెందిన ఐఏఎస్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర కమ్యూనికేషన్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ మనోజ్ ప్రగడ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా మన దేశం ఆర్థికాభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఆత్మీయ సంస్థ ప్రతినిధులు నక్కా ఓంప్రకాష్, ఎస్వీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ శీలం రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు పార్థసారథి, హరి, పలువురు ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నారాయణవనం బాలికోన్నత స్కూలుకు జాతీయ గుర్తింపు

నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ హరిత పాఠశాలగా బాలికల ఉన్నత పాఠశాలగా నారాయణవనం బాలికోన్నత పాఠశాల ఎంపికైంది. న్యూఢిల్లీకి చెందిన జీఎస్టీ ఆడిట్ 2024-25 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్‌లో మూడోసారి ఉత్తమ హరిత పాఠశాలగా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శశికళ, గ్రీన్ సమన్వయకర్త శ్యామలత తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఆలయ హుండీ చోరీ

నాగలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఎస్ఎస్‌పురం ఆది ఆంధ్రవాడ మాతమ్మ ఆలయ హుండీ గురువారం చోరీకి గురైంది. ఆల యంలో ప్రతి రోజు కాలనీకి చెందిన వ్యక్తి పూజలు నిర్వహించేవారు. అదే విధంగా ఆ వ్యక్తి గురువారం ఉదయం యథావిధిగా ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లగా గేటుకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటం, అలాగే హుండీ కనిపించక పోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. చోరీపై విచారణ చేపట్టి దుండగులను పట్టుకోవాలంటూ పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

గిరిజనులకు ఎస్టీ కమిషన్ అండ


ప్రసంగిస్తున్న వడిత్యా శంకర్‌నాయక్

సత్యవేడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కు లను కాపాడడంలో రాష్ట్ర కమి షన్ ఎల్లవేళలా సిద్ధంగా ఉం టుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దాసుకుప్పం, కొత్త మారి కుప్పం, సత్యవేడు పంచాయతీల్లోని గిరిజన కాలనీల్లో వడిత్యా శంకర్ పర్యటించి గిరిజనుల సమస్యలపై ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేడు బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు గిరిజనులు విన్నవించారు. అదే సర్పంచు రమేష్, ఎంఈవో రవి, గూడూరు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి బేబీ రాణి, ఏఎస్‌డబ్ల్యూ కృష్ణ, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ పాల్గొన్నారు.

పర్మిట్లు లేకుండా వాహనాలు నడపరాదు

కేవీబీపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పర్మిట్లు లేకుండా వాహనాలు నడపరాదని శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్‌నాయుడు చెప్పారు. గురువారం మండలంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు భారీ వాహనాలను సీజ్ చేసి, నాలుగు వాహనాలకు జరిమానా విధించారు. వాహనాలు రోడ్లపైకి వచ్చే సమయంలో తగిన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.

తిరుమలలో బ్రహ్మానందం




సతీష్‌రెడ్డి - ఆనంద్‌సాయి

తిరుమల శ్రీవారిని గురువారం సినీనటుడు బ్రహ్మానందం దర్శించుకున్నారు. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, భారత ప్రభుత్వ సైంటిఫిక్ అడ్వైజర్ సతీష్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి కూడా దర్శనం చేసుకున్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

ఘాట్‌లో నిర్దేశిత సమయం పాటించాల్సిందే!



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఏటీఎం రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో నిర్దేశించిన 45 నిమిషాల సమయం పాటించాల్సిందేనని సెంట్రల్ బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు డ్రైవర్లను ఆదేశించారు. గురువారం ఆయన బస్టాండు ఆవరణలో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఘాట్‌లో ముందెళ్లే వాహనాలను అధిగమించకూడదని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీఎంతః నరసింహులు ఆధ్వర్యంలో అలిపిరి బాలాజీ బస్టాండు వద్ద బస్సు కండిషన్స్‌ను తనిఖీ చేశారు. 300 బస్సులను పరిశీలించి, ఘాట్ ఎలిజి బుల్ ముద్రవేశారు.

ఆర్.కృష్ణయ్యకు ఘన స్వాగతం



తిరుపతి (ఆటోనగర్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరగనున్న విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశంలో పాల్గొనడానికి గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన ఆర్.కృష్ణయ్యకు ఆ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, డిస్కం కార్యదర్శి ఎల్.చలపతి ఉన్నారు.

ఎస్వీయూలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో బోధనేతర ఉద్యోగ సంఘం సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించింది. విజేతలుగా నిలిచిన మహిళా ఉద్యోగులకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బోధనేతర ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు పీకే సుబ్రమణ్యం, మనోజ్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ డైరెక్టర్ బదిలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ఎస్సీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ యు.చెన్నయ్య బదిలీ అయ్యారు. చిత్తూరుకు ఆయన్ను బదిలీ చేశారు. తిరుపతి ఎస్సీ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని ఆ స్థానంలో నియమించారు.

నన్నే ఆపతారా?

తిరుచానూరు వద్ద హైవేపై నడుచుకుంటూ వెళ్లిన జగన్



తిరుచానూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాధితుల పరామర్శకు గురువారం మాజీ సీఎం జగన్ వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి ఆయన కాన్వాయ్ వస్తుండగా తిరుచానూరు సమీపంలో హైవేలో పోలీసులు కొంతసేపు ఆపారు. 'నన్నే మీరు ఆపతారా' అంటూ జగన్ కారు దిగి షికారికాలనీ నుంచి కొంతదూరం నడుచుకుంటూ హైవేపై నడకప్రారంభించారు. వైసీపీ కార్యకర్తలు జై జగన్, పులివెందుల పులి అంటూ రోడ్డుమీద హల్‌చల్ చేశారు. అయితే, ఎక్కడ సమస్య ఉత్పన్నం అవుతుందోనని ట్రాఫిక్‌ను వదిలేశారు. దీంతో ఆయన కారు ఎక్కి స్విమ్స్‌కువెళ్లారు. ఆయన వెంట నేతలు ఉన్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు ఉన్నారు. కాగా, విమానాశ్రయంలో జగన్ బయలుదేరే సమయానికే స్విమ్స్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షతగాత్రులను పరామర్శిస్తున్నారు. అదే సమయంలో జగన్ అక్కడికి వెళితే ఎక్కడ ఇబ్బందులు తలెత్తుతాయోనని జగన్ కాన్వాయ్‌ని పోలీసులు కాసేపు ఆపినట్లు తెలిసింది. దీంతో ఈ హడావిడి నెలకొంది.

తొక్కిసలాట బాధాకరం

తిరుపతి (జీవకోన), జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట చోటుచేసుకోవడం బాధాకరమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల రద్దీని అంచనా వేయడంలో టీటీడీ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ధర్మకర్తలమండలి, ఉన్నతాధికారులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఈ ఘటన జరిగిందని వివరించారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి, జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు ఆదేశించాలన్నారు.

యుద్ధప్రాతిపదికన పోస్టుమార్టం పూర్తి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రి మార్చురీలో గురువారం యుద్ధప్రాతిపదికన ఆరు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం బుద్దేటి నాయుడు బాబు, రజని, లావణ్య, నిర్మల, శాంతి, మల్లిగ మృతదేహాలను ఆరు అంబులెన్సుల ద్వారా వారి వారి స్వగ్రామాలకు తరలించారు. ప్రతి అంబులెన్సులోనూ వీఆర్వోను ఉంచి పంపారు. మృతుల బంధువులు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11.45 గంటలకు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి మృతదేహాలను తరలించడంలో అటు పోలీసులు, ఇటు ఆస్పత్రి, రెవెన్యూ వర్గాలు పనిచేశాయి.

మంత్రుల ఆవేదన : కొంతమంది అధికారులు తప్పిదంతో మన రాష్ట్రానికి చెందిన నలుగురు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన మరో ఇద్దరు చనిపోవడం బాధాకరమని మంత్రులు అనిత, కొలుసు పార్థసారధి, అనగాని సత్య ప్రసాద్, సత్యకుమార్, నిమ్మల రామానాయుడు, ఆనం రాంనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని స్వయానా సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షత గాత్రులను పరామర్శించి వారికి అవసరమైన అన్ని సహాయక చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.

తిరుపతి-హైదరాబాదు మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే హైదరాబాదు-తిరుపతి మధ్య మరో రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

- హైదరాబాదు నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు (07211) 12వ తేదీ రాత్రి 9.45 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా మరుసటి రోజు ఉదయం 10.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07212) ఈనెల 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 7.50 గంటలకు హైదరాబాదు చేరుకుంటుంది.

గుంతకల్లు డీఆర్ఎం పర్యటన

తిరుపతి(సెంట్రల్) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం రేణిగుంటకు చేరుకున్నారు. గుంతకల్లు నుంచి రేణిగుంట వరకు స్పెషల్‌లో తాడిపత్రి, కడప, రాజంపేట రైల్వేస్టేషన్లను తనిఖీ చేస్తూ రాత్రి 7 గంటలకు రేణిగుంటకు చేరుకున్నారు. శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేస్తారు. అనంతరం రేణిగుంటకు చేరుకుని గుంతకల్లుకు తిరుగు ప్రయాణమవుతారు.

పద్మావతీ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 13న సికింద్రాబాదు నుంచి బయలు దేరనున్న పద్మావతీ ఎక్స్‌ప్రెస్ రైలుకు (12764) 2ఏసీతోపాటు 3ఏసీ కోచ్‌ను అదనంగా ఏర్పాటు చేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

పోటాపోటీగా అంతర కళాశాల క్రీడా పోటీలు

ఓవరాల్ చాంప్‌గా ఆతిథ్య ఎస్వీ వెటర్నరీ కళాశాల





క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా నిర్వహించే 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు గురువారం పోటాపోటీగా సాగాయి. విజేతల వివరాలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్ర వెల్లడించారు. పురుషుల వాలీబాల్, మహిళ బాస్కెట్‌బాల్, పురుషుల షటిల్ బ్యాడ్మింటన్, మహిళల టెన్నికాయిట్, పురుషుల బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్‌లో ఆతిథ్య తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. పురుషుల బాస్కెట్‌బాల్‌లో గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, మహిళల బాల్‌బ్యాడ్మింటన్‌లో గరివిడి వెటర్నరీ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. పురుషుల 800మీటర్ల రన్నింగ్ పోటీలలో రాజేష్, మహిళల విభాగంలో ఎన్.ప్రణీత(గరివిడి వెటర్నరీ కాలేజ్), 1500మీటర్ల పురుషుల రన్నింగ్‌లో వై.దుర్గాప్రసాద్, మహిళల విభాగంలో కె.త్రివేణి (తిరుపతి వెటర్నరీ, డెయిరీటెక్నాలజీ కళాశాలలు), పురుషుల 5వేలమీటర్ల రన్నింగ్‌లో ఎన్.రాజేష్(గరివిడి వెటర్నరీ కాలేజ్), పురుషుల డిస్కస్ త్రోలో ఎం.వెంకటప్రసాద్(తిరుపతి డెయిరీ టెక్నాలజీ), పురుషుల లాంగ్‌జంప్ ఎలో ఎన్.విజయ్(తిరుపతి వెటర్నరీ కాలేజ్), మహిళల విభాగంలో వి.సాయి పూజిత(గరివిడి వెటర్నరీ కళాశాల), పురుషుల ట్రిపుల్ జంప్‌లో జి.మహేశ్వర్ రెడ్డి(గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ కాలేజ్) ప్రథమస్థానం సాధించారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఓఎస్‌ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఫిజియాలజి హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య క్రీడా, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మృతులకు నివాళి



దీపాలతో నివాళులర్పిస్తున్న తిరుపతి పౌర సంఘాల సమాఖ్య నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన శ్రీవారి భక్తులకు తిరుపతి పౌర సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. టీటీడీ పరిపాలన భవనం ఎదుట గురువారం సాయంత్రం దీపాలు వెలిగించి, నివాళులర్పించారు. నాయకులు కందారపు మురళి, మాంగాటి గోపాల్‌రెడ్డి, పి.అంజయ్య, సి.పెంచలయ్య, పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరుగురు భక్తులు మృతి చెందడం టీటీడీకి మాయని మచ్చగా మిగిలిందన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో సంస్థ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం

తిరుపతి(విద్య), జనవరి 9: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ కోలకతా విడుదల చేసిన ఏఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. వి.శ్రీకర్ 298 మార్కులు, ఎస్.ఐ.నందిని 284, ఎస్.అబ్దుల్ లతీఫ్, ఆర్.హూర్లిమ 282, ఎ.హరీష్ 280, ఆర్.విగ్నయ్ 272, బి.దీపిక 268 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని చెప్పారు. పరీక్ష రాసిన తమ విద్యార్థుల్లో 95.13 శాతం మంది ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. వారిని సంస్థ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో ఎమరాల్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ముందస్తు సంక్రాంతి



సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు

తిరుపతి(విద్య), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, ఆటపాటలతో సందడి చేశారు. అందమైన ముగ్గులతో పాఠశాల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ఎన్నెన్నో అనుభూతులు, మరెన్నో మేళవింపులు, భావోద్వేగాల తీపి గుర్తులకు సంక్రాంతి పండుగ ప్రతీకని వివరించారు. ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ బాలాజి, జోనల్ అకడమిక్ డీన్ సురేష్, సీఅండ్ఎం ఇన్‌చార్జి నరేంద్రబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి అర్చన పాల్గొన్నారు.

గొప్ప యాత్రా చరిత్ర

శేషాచలం కొండల్లో పుస్తకావిష్కరణలో ఆచార్య వకుళాభరణం రామకృష్ణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ట్రెక్కర్ రాఘవ రాసిన శేషాచలం కొండల్లో పుస్తకం గొప్ప యాత్రా చరిత్ర అని ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. ఎస్వీయూ లైబ్రరీలో గురువారం నిర్వహించిన శేషాచలం కొండల్లో పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ట్రెక్కింగ్ సాహసోపేతమైందన్నారు. ఈ అనుభవాలను పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగులో ఇప్పటివరకూ వచ్చిన యాత్రా చరిత్రల సరసన నిలిచే గొప్ప పుస్తకం శేషాచలం కొండల్లో అని కొనియాడారు. ఫారెస్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాఘవతో కలిసి గుంజన జలపాతం తొలిసారి చూడటం మంచి అనుభూతి కలిగించిందన్నారు. రచయిత రాఘవ మాట్లాడుతూ ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుకునే ఆలోచనతోనే టెక్కింగ్ చేయడం, పుస్తక రాయడం చేశానన్నారు. పరమేశ్వరరావు, హరీష్, సాకం నాగరాజ, ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, వాకా ప్రసాద్, సాహితీవేత్తలు, ట్రెక్కర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముగిసిన యూజీసీ పర్యటన

దూరవిద్య ప్రమాణాలపై మూడు రోజుల అధ్యయనం



అధ్యాపకులతో సమావేశమైన యూజీసీ కమిటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగాన్ని యూజీసీ బృందం మూడు రోజులుగా పరిశీలించింది. గురువారం దూరవిద్య అధ్యాపకులతో యూజీసీ కమిటీ సమావేశమైంది. దూరవిద్య విభాగం నిర్వహణ, కోర్సులు, బోధన, విద్యార్థులు, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సిబ్బంది పనితీరు వంటి పలు వివరాలను పరిశీలించారు. అనంతరం యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా విభాగ అభివృద్ధి, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. దూరవిద్య పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమావేశమై పలు వివరాలను తెలుసుకున్నారు. ఈ బృందంతో ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర, ఆచార్య అరింద్ రనడే, యూజీసీ డిప్యూటీ సెక్రటరీ వినోద్ సింగ్ యాదవ్ ఉన్నారు. వీరికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, దూరవిద్యా డైరెక్టర్ తవమణి దూరవిద్య ప్రగతిని వివరించారు.

తరచూ ఆరోపణలు, చర్యలకు గురవుతున్న అధికారులు

తిరుపతి, ఆంధ్రజ్యోతి : గత ఏడాది కాలంగా రెవిన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు తరచూ అభియోగాలకు, ఆరోపణలకు, చర్యలకు గురవుతుండడం చర్చనీయాంశంగా మారుతోంది. కొందరు ఎలాంటి ఆరోపణలూ ఎదుర్కోకపోయినా బదిలీలకు గురయ్యారు. గతేడాది ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌గా వచ్చిన లక్ష్మీశా తిరుపతి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఇంటికి వెళ్ళి శాలువా కప్పి సన్మానించడంతో ఈసీ బదిలీ చేసింది. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి బదిలీతో ఆ స్థానంలో వచ్చిన మల్లికా గార్గ్‌పై ఆరోపణలు లేకపోయినా ముక్కుసూటితనంతో వ్యవహరించడం వల్ల 20 రోజులకే రాజకీయ బదిలీకి గురయ్యారు. ఆమె తర్వాత ఎస్పీగా వచ్చిన కృష్ణకాంత్ పటేల్ చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం ఘటనతో ఈసీ బదిలీ వేటు వేసింది. ఆ ఘటనకు సంబంధించే చంద్రగిరి డిఎస్పీ, స్పెషల్ బ్రాంచి డిఎస్పీలు సైతం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన హర్షవర్ధన్ రాజు ఆరు నెలల్లోపే కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రత్యామ్నాయంగా వచ్చిన సుబ్బరాయుడు సీఎం చంద్రబాబు సన్నిహిత అధికారిగా పేరుపడ్డారు. అలాంటి అధికారి కూడా తాజాగా తొక్కిసలాట ఘటనతో శాంతిభద్రతల పరంగా విఫలమయ్యారన్న ఆరోపణలతో బదిలీ వేటుకు గురయ్యారు. ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ వ్యవహారంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా గతంలో పనిచేసిన ఐఏఎస్ అధికారి గిరిశా సస్పెండ్ అయ్యారు. మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిపైనా సస్పెన్షన్ వేటు పడింది. ఇదే వ్యవహారంలో తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు కూడా సస్పెండ్ అయ్యారు. తిరుపతి ఆర్డీవోగా పనిచేసిన నిశాంత్‌రెడ్డి లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. తర్వాత ప్రభుత్వం ఆయనపై చర్యను ఉపసంహరించుకుంది. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో దొంగ ఓటర్లపై నమోదైన కేసుల దర్యాప్తు సక్రమంగా చేయలేదని ఈసీ తిరుపతి ఈస్ట్ డీఎస్పీ సురేంద్రరెడ్డి, ఈస్ట్ సీఐ శివప్రసాద్‌రెడ్డి, వెస్ట్ సీఐ శివప్రసాద్, అలిపిరి సీఐ అబ్బన్న, ఈస్ట్ ఎస్ఐ జయస్వాములు తదితరులను సస్పెండ్ చేయించింది. ఇలా చూస్తే కేవలం ఏడాది కాలంలోనే ఎంతోమంది రెవిన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు ఆరోపణలు ఎదుర్కొని లేదా ముక్కుసూటితనంతో బదిలీలకు, సస్పెన్షన్లకు గురయ్యారు. తాజాగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ సీవీఎస్వో బదిలీ వేటుకు గురి కావడం, డీఎస్పీ, గోశాల డైరెక్టర్ సస్పెండ్ కావడంతో ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారుతోంది.

భక్తుల మృతి బాధాకరం

ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. రుయా మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. గాయపడిన వారిలో ఇప్పటికే 13 మంది డిశ్చార్జి అయ్యారని, మిగిలిన 29 మంది స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నారని అన్నారు. అన్ని రకాల వైద్య సేవలు అందించి, స్వగ్రామాలకు తీసుకెళ్లి అప్పగించే విధంగా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

భారీ అలలకు కొట్టుకెళ్లిన వైనం ● తిరుపతి జిల్లాలో దుర్ఘటన



భానుప్రకాష్ - లోకేష్

వాకాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ దుర్ఘటన తిరుపతి జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిట్టమూరు మండలం మల్లాంలోని సీవీఎస్ఆర్ ఇంటర్మీడియట్ కళాశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు కాలేజీకని చెప్పి ఇంట్లోనుంచి బయల్దేరారు. ఆ తర్వాత వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరానికి చేరుకున్నారు. గురువారం ఉదయం 11.45గంటలకు సముద్రంలో దిగి స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన భారీ అలలకు నెల్లూరుజిల్లా కావలి ప్రాంతం బంగారుపాళెం గ్రామానికి చెందిన మామిడి లోకేష్ (17), చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన ఇంగిలాల భానుప్రకాష్ (18)లు సముద్రంలోకి కొట్టుకుపోయారు. భయపడిన మిగిలిన ఆరుగురు ఒడ్డుకు చేరుకుని కేకలు పెట్టారు. అక్కడున్న మత్స్యకారులు గమనించి.. రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విద్యార్థులు ఇద్దరూ గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మెరైన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు మొదలుపెట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు ఆపేశారు. శుక్రవారం ఉదయం నుంచి తిరిగి మొదలుపెడతామని పోలీసులు తెలిపారు. గల్లంతైన విద్యార్థుల కుటుంబ సభ్యులు సముద్ర తీరానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కాగా, లోకేష్.. వాకాడు మండలం వైట్‌కుప్పంలోని తన మామ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. భానుప్రకాష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు స్నేహితులు తెలిపారు.



తిరుమలలో వైకుంఠ శోభ

● నేటి నుంచి పదిరోజుల ఉత్తరద్వార దర్శనాలు ● సుందరంగా ముస్తాబైన శ్రీనివాసుని ఆలయం

తిరుమల, జనవరి9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల క్షేత్రం ఉత్తరద్వార దర్శనాలకు సిద్ధమైంది. పదిరోజుల పాటు జరిగే వేడుకకు శోభాయమానంగా ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు వైకుంఠ ద్వారాన్ని తెరిచి దర్శనం కల్పించనున్నారు. ఈక్రమంలో ఆలయాన్ని శోభాయమానం తీర్చిదిద్దారు. ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరించారు. వైకుంఠద్వారం, బలిపీఠం, ధ్వజ స్తంభం వంటి ప్రాంతాలను 1.40 కట్‌ఫ్లవర్స్‌తో అలంకరించారు. ఆలయం వెలుపల ఐదు టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగించారు. వాహన మండపం సమీపంలో 'శ్రీరంగనాథమండపం' సిద్ధం చేశారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో రంగనాథస్వామి ఆలయ సెట్టింగ్ వేశారు.

తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

గురువారం అర్ధరాత్రి శ్రీవారి ఆలయంలోని వైకుంఠద్వారాలు తెరుచుకున్నాయి. 12.05 గంటల సమయంలో తలుపులు తెరిచిన అర్చకులు శుక్రవారం వేకువజాము ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. 4.30 వీఐపీ దర్శనాలను కల్పించనున్నారు. టోకెట్లు, టికెట్లు పొందిన భక్తులను గురువారం అర్ధరాత్రి12 గంటల నుంచి క్యూకాంప్లెక్స్‌లోకి అనుమతించారు. వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 8 గంటలకు ముగియనున్నాయి. తర్వాత సర్వదర్శనాలను ప్రారంభించనున్నారు.

టోకెన్ ఉన్నవారికే ఎంట్రీ, వసతి

టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను గురువారం రాత్రి నుంచి కంపార్టుమెంట్లలోకి అనుమతించారు. వారికే గదులను కేటాయించారు. టికెట్లు లేనివారు గదులు లేక షెడ్లు, పార్కులు, కార్యాలయాల ముందు, వసతి సముదాయాల్లో, ఫుట్‌పాత్‌ల పైనే సేదతీరాల్సి వచ్చింది. చలికి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేకదర్శనాలన్నీ రద్దు

ఈపదిరోజులకు సంబంధించి ఇప్పటికే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు 1.40 లక్షలు, శ్రీవాణి టికెట్లు 19,500 జారీ చేశారు. తొలిమూడురోజులకు సామాన్య భక్తులకు స్లాటెడ్ సర్వదర్శనానికి సంబంధించి 1.20 లక్షల టోకెన్లను జారీ చేసింది. తర్వాత రోజులకు ఏరోజుకారోజు విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల ద్వారా జారీ చేయనున్నారు. పదిరోజుల్లో వీఐపీ బ్రేక్‌కు సిఫార్సులు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు వంటి ప్రత్యేకదర్శనాలు ఉండవు. శ్రీవారిమెట్టు మార్గంలోనూ దివ్యదర్శన టోకెన్ జారీ ఉండదు.

వీఐపీలకు చేసిన ఏర్పాట్లు

వీఐపీల పర్యటన నేపథ్యంలో తిరుమలలో 12 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఎంటీసీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీఐపీలకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు నాలుగు కేంద్రాల్లో జరిగాయి. వెంకటకళ అతిథిగృహంలోని కౌంటర్‌లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, మంత్రులు, విప్‌లు, స్పీకర్లకు టికెట్లను జారీ చేశారు. సన్నిధానం కౌంటర్‌లో టీటీడీ బోర్డు చైర్మన్, బోర్డు సభ్యులు, వారి సిఫార్సులపై టికెట్లు కేటాయించారు. నారాయణగిరి-4 కౌంటర్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు టికెట్లను జారీ చేశారు. వకుళమాత విశ్రాంతి భవనం కౌంటర్ ద్వారా ఆలిండియా సర్వీస్ అధికారులకు దర్శన టికెట్లు, గదుల కేటాయింపు జరిగింది.



నేడు స్వర్ణరథోత్సవం

శుక్రవారంఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు వాహనమండపంలో శ్రీమలయప్పస్వామి దర్శనం ఉంటుందన్నారు. శనివారం ద్వాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము 5.30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన కార్యక్రమం జరుగుతుంది.



ఘటనపై రెండు కేసులు



మార్చురీలో మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు భక్తుల మృతిపై డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాలతో సీఐ రామకృష్ణ రెండు వేర్వేరు ఎఫ్‌ఆర్‌ఐలు నమోదు చేశారు. బుధవారం రాత్రి తిరుపతిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన మెట్టూరువాసి ఆర్.మల్లిక.. విష్ణునివాసం వద్ద దర్శన టోకెన్ల కోసం క్యూలో నిలబడి అక్కడ జరిగిన తొక్కిసలాటలో స్పృహతప్పి పడిపోయిందని బాలాయపల్లి తహసీల్దార్ పి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఇది మొదటి కేసుగా పోలీసులు తెలిపారు. మల్లికను రుయాకు తీసుకెళుతుండగా, ఆస్పత్రికి వెళ్లేలోగా మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన మేరకు ఆ సమయంలో ఇతర భక్తులు క్యూలైన్ వైపు పరుగెత్తడంతో ఆమె అనారోగ్యం కారణంగా నేలపై పడిందని తెలిపారు. వీరితోపాటు బైరాగిపట్టెడ పార్కు వద్ద మృతి చెందిన ఐదుగురికి సంబంధించి నారాయణవనం తహసీల్దార్ ఎం.జయరాములు ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన కందిపల్లి శాంతి, గుడ్ల రజని, బొడ్డేటి నాయుడు బాబు, సూరిశెట్టి లావణ్య స్వాతి, తమిళనాడుకు చెందిన నిర్మల మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. రామానాయుడు పార్కు వద్ద దర్శనం టికెట్ల కోసం వేచి ఉండగా క్యూలో ఒక్కసారిగా తోపులాట జరిగి కిందపడ్డారని తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిని రుయాకు తరలించగా.. ఈ ఐదుగురు కూడా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ రెండు కేసులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలకు బాధ్యులెవరు? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. బంధువులు, కుటుంబీకుల నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.

ప్రత్యక్ష సాక్షుల కథనాలు

గోవిందా..గోవిందా అంటూ...

నేను టోకెన్ల కోసం వచ్చి 8.10-8.25గంటలమధ్య ముందువరుసలోనే ఉన్నాను. గోవిందా.. గోవిందా అంటూ నా వెనుకనుంచి బలవంతంగా తోయడంతో కిందపడిపోయాను. దీంతో ఊపిరి ఆడలేదు. ఎలాగో పైకి లేచి నిల్చుని ఊపిరి పీల్చుకున్నాను. తొక్కిసలాట జరిగింది. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైకోసెట్‌లో పలుమార్లు అనౌన్స్ చేశారు. అక్కడున్న వారిలో చాలామంది తెలుగువాళ్లు కాదు. తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. వాళ్లకు అర్థం కాలేదు. కొంతమంది కదిరి, పులివెందుల ప్రాంతాల నుంచి వచ్చినట్టు వాళ్ల యాసను బట్టి అర్థం అయ్యింది. ఒక ఉప్పెనలా ముందుకు రావడంతో అంతా గందరగోళం అయిపోయింది. రెండుగేట్లు ఓపెన్ అయిపోయాయి. పోలీసులు ఎంతప్రయత్నించినా నిలువరించలేకపోయారు. భక్తులు కిందపడిపోయారని పోలీసులు చెబుతున్నా వినకుండా ఫోర్స్‌గా తోసుకుంటూ వచ్చారు.

- సుదర్శన్‌రెడ్డి, కడప



పోలీసులు అరుస్తున్నా..

తిరుపతి రూరల్ మండలం అవిలాల మాది. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో అటువైపు వెళ్లాను. పార్క్‌లో చిన్నపిల్లలు, వృద్ధులు, భక్తులు ఎక్కువసంఖ్యలో కనిపించారు. తిరిగిరాత్రి 8.20గంటలప్రాంతంలో ఈమార్గంలో వెళ్తూ అటు చూశాను. వేలాదిమంది టోకెన్లకోసం పార్క్‌లో గుమికూడా ఉన్నారు. ఒకరినొకరు తోసుకుంటూ ఉన్నారు. గేటుకు దూరంగా జరగాలని పోలీసులు మైక్‌సెట్‌లో చెబుతున్నారు. ఈలోపే తొక్కిసలాట జరిగింది.

- లక్ష్మణ్, అవిలాల



అంతా గేటు ముందే!

మధ్యాహ్నం నుంచి భక్తులరాక బాగా పెరిగింది. వచ్చినవారందరూ గేటుముందు భాగంలోకి వచ్చి తోసుకుంటూ ఉన్నారు. వెనుక భాగమంతా ఖాళీగానే ఉంది. పోలీసులు వెనుకకు జరగండని అనౌన్స్‌మెంట్ చేశారు. తీరా గేట్లు తెరచీతెరవముందే భక్తులు దూసుకువచ్చారు. దీంతో తోపులాట జరిగింది. ఘోరం జరిగిపోయింది.

- రాకేష్, స్థానిక దుకాణం వ్యక్తి

స్పెషల్ ఫ్లైట్లతో కిటకిటలాడిన ఎయిర్‌పోర్ట్

రేణిగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన పెను విషాదం, వైకుంఠ ఏకాదశి పర్వదినం వెరసి వీఐపీల తాకిడితో విమానాశ్రయం గురువారం కిటకిటలాడింది. బాధితులను పరామర్శించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ వేర్వేరుగా తిరుపతి పర్యటనకు వచ్చారు. సీఎం మధ్యాహ్నం 1.20గంటలకు వచ్చి రాత్రి ఎనిమిది గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 3.30గంటలకు వచ్చి రాత్రి 8.25గంటలకు బయల్దేరారు. మాజీ సీఎం జగన్ సాయంత్రం 5.30 గంటలకు ఇక్కడకు చేరుకున్నారు. వీరంతా ప్రత్యేక విమానంలో వచ్చారు. మరోవైపు తిరుమలేశుడి వైకుంఠ ద్వార దర్శనం కోసం కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.30గంటలకు వచ్చారు. తర్వాత తిరుచానూరులో జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇండిగో విమానంలో కుటుంబీకులతో కలిసి మధ్యాహ్నం 1.10గంటలకు వచ్చారు. తర్వాత తిరుమలకు బయల్దేరి వెళ్లారు. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ.. ఇండిగో విమానంలో ఉదయం 10.50గంటలకు వచ్చారు. తిరుపతి, రాజంపేటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని, 11వ తేదీన శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. ఇండిగో విమానంలో సాయంత్రం 4 గంటలకు వచ్చారు. తర్వాత రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెల్లవారుజామున 4.55 గంటలకు విమానాశ్రయం చేరుకుని, తిరుమలకు వెళ్లారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తిరుమలేశుడి దర్శనార్థం విశాఖపట్నం నుంచి వచ్చారు. ఇలా వచ్చిన వీఐపీలతోపాటు వారికి స్వాగతం పలకడానికి వచ్చిన వారితో తిరుపతి విమానాశ్రయం కిక్కిసింది. ఇక శుక్రవారంనుంచి వైకుంఠ ద్వార దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు రానున్నారు.

టీటీడీ చరిత్రలో చీకటి రోజు

ఇటువంటి ఘటన జరగడం చాలా బాధాకరం. టీటీడీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా నిలిచిపోతుంది. అధికారుల వైఫల్యమే దీనికి ప్రధాన కారణం. మృతుల కుటుంబీకులకు టీటీడీ, ప్రభుత్వం అండగా నిలుస్తుంది. గాయపడిన ప్రతీ ఒక్కరు కూడా స్వామివారిపై ఉన్న భక్తితో తమకు దర్శన భాగ్యం కల్పించండి అని కోరుతున్నారు. వారి కోరిక మేరకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించి, సురక్షితంగా స్వగ్రామాలకు పంపే ఏర్పాటు చేస్తాం.

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ఇలాంటి ఘటన దురదృష్టకరం

ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం. అంచనాలకు మించి భక్తులు అధిక సంఖ్యలో రావడం, వారిని అదుపు చేయలేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఏమాత్రం ఉందనేది విచారణలో తేలుతుంది. బాధ్యతా రహితంగా వ్యవహరించిన వారికి శిక్ష తప్పదు. అలాగే బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది.

- టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి

టీటీడీ వైఫల్యం ఏమీ లేదు

శ్రీవారి భక్తులకు ఈ విధంగా జరగడం చాలా బాధాకరం. వైకుంఠ దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పక్కాగా చేసింది. అయినప్పటికీ ఊహించని రీతిలో భక్తులు రావడం, వారు దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసి ఉండటం వల్ల సక్రమంగా ఆహారం లేక నీరసించి కిందపడి పోవడంతో తొక్కిసలాట జరిగింది. ఇందులో టీటీడీ వైఫల్యం ఏమీ లేదు.

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

సాధారణ భక్తులకు ప్రాధాన్యం లేకనే..

టీటీడీలో వీఐపీలకు తప్ప సాధారణ భక్తులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అందువల్లే సాధారణ భక్తుల విషయంలో టీటీడీ, పోలీసుల సమన్వయం లేక ఇటువంటి దురదృష్టకర ఘటన జరిగింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతుల కుటుంబాలను, బాధితులను టీటీడీ, ప్రభుత్వం ఆదుకోవాలి.

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శవ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

వైసీపీ నేతలు వారు చేసిన తప్పులను మరిచి జరిగిన దురదృష్టకర ఘటనను అడ్డం పెట్టుకొని శవ రాజకీయాలు చేసేందుకు తెర లేపుతున్నారు. ప్రధానంగా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి.. టీటీడీని, ప్రభుత్వాన్ని నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. బాధితులను పరామర్శించి.. అండగా ఉండాలే కానీ, తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు.

- తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



టీటీడీ పరిపాలనా భవనంలో మంత్రులు, అధికారులతో సీఎం మీడియా సమావేశం

టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే!

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఘటనకు టీటీడీ, ప్రభుత్వ వైఫల్యమే కారణమని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా వైకుంఠ ఏకాదశి పేరుతో సమీక్షలు నిర్వహించారే తప్పా ఆచరణలో తగిన ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. టీటీడీలో పనిచేసే వారు తక్కువయ్యారని పర్యవేక్షించేవారు ఎక్కువ అయ్యారని అన్నారు. దర్శనాలకు సంబంధించిన అంశం పూర్తిగా తిరుమల అడిషనల్ ఈవో వెంకన్న చైదరికి సంబంధించిందని ఆయనకు చంద్రబాబు సేవ తప్ప భక్తుల సేవ కనబడటంలేదని విమర్శించారు. ఈ ఘటనలో అడిషన్ ఈవో వెంకన్నచౌదరితో పాటు ఎస్పీ, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని, ఈవోను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పిన పవనానంద స్వామి దీనిపై మాట్లాడాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మోహిత్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన మేయర్ శిరీష, మోహిత్‌రెడ్డి

వీవీఐపీల రాకతో ఒత్తిడికి గురైన యంత్రాంగం



అధికారులతో చంద్రబాబు

తిరుపతిలో బుధవారం తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఇప్పటికే తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న జిల్లా యంత్రాంగంపై గురువారం వీవీఐపీల వరుస పర్యటనలు మరింత ఒత్తిడి పెంచాయి. దాంతో అధికారులు సతమతమయ్యారు. బుధవారం తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన దుర్ఘటనను తీవ్రంగా పరిగణించిన సీఎం చంద్రబాబు బుధవారం రాత్రే అధికారులపై మండిపడ్డారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపడం, సీఎం చంద్రబాబు సీరియస్ కావడంతో జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు ఆందోళనకు గురయ్యారు. పర్యవసానాలు ఎలా వుంటాయోనని వారిలో గుబులు మొదలైంది. అదే సమయంలో గురువారం తిరుపతి వస్తానని సీఎం ప్రకటించడంతో అధికారులను టెన్షన్ చుట్టుముట్టింది. సీఎం ఏమి చూస్తారో, ఏమి అడుగుతారో, ఏం చేస్తారోనని భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరవనున్న సంగతి తెలిసిందే. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వీవీఐపీలు వస్తుండడంతో వారికి రవాణా, బస, దర్శనాలు ఏర్పాటు చేయడంలో అటు జిల్లా యంత్రాంగం, ఇటు టీటీడీ యంత్రాంగం కూడా తలమునకలవుతున్నాయి. ఆ సమయంలో తొక్కిసలాట ఘటన జరగడం, సీఎం గురువారం పర్యటన తలపెట్టడం అధికారులకు ఊపిరి సలపకుండా చేశాయి. గురువారం ఉదయాన్నే ఏకంగా ఆరుగురు మంత్రులు తిరుపతిలో దిగారు. జిల్లా ఇంఛార్జి మంత్రి హోదాలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామా నాయుడు, హసింగ్ మంత్రి కొలుసు పార్థసారథి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు బృందంగా ఏర్పడి రుయా, స్విమ్స్ ఆస్పత్రులు సందర్శించారు. వారికి కాన్వాయ్‌లు, పోలీసు ఎస్కార్ట్, వెంట అధికారులను నియమించాల్సి వచ్చింది. బస ఇతర ఏర్పాట్లు కూడా చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి సీఎం చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచీ తిరుపతి వచ్చారు. సీఎం కోసం కాన్వాయ్, భారీ భద్రత కల్పించారు. వెంట జిల్లా అధికారులు మొత్తం వుండాల్సి వచ్చింది. బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద బహిరంగంగానే ఆయన కలెక్టర్, టీటీడీ ఈవో, ఎస్పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామం అధికారులను తీవ్ర ఒత్తిడికి లోను చేసింది. సీఎం స్విమ్స్ పద్మావతి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించడం, టీటీడీ పరిపాలన భవనం చేరుకుని అధికారులతో సమీక్షించడం చేశారు. సమీక్షలోనూ అధికారుల తీరుపై మండిపడినట్టు సమాచారం. దానికి తగ్గట్టే ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు, మరో ముగ్గురిపై బదిలీ వేటు పడింది. ఈ పరిణామం అధికారులను మరింత ఇరుకున పడేసింది. సీఎం పర్యటన సాగుతుండగానే సమాంతరంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి చేరుకున్నారు. ఆయనకు కాన్వాయ్, భారీ భద్రత, వెంట అధికార యంత్రాంగం వుండాల్సి వచ్చింది. ఆయన కూడా బైరాగిపట్టెడ వెళ్లి అక్కడ నుంచీ స్విమ్స్ వచ్చారు. ప్రజాకర్షణ కలిగిన నేత కావడంతో భారీగా భద్రత కల్పించాల్సి వచ్చింది. ఈ ఇద్దరూ తిరుపతిలో పర్యటిస్తుండగానే ఇంకోవైపు మాజీ సీఎం జగన్ కూడా తిరుపతి వచ్చారు. ఇలా వీవీఐపీలు ఏక కాలంలో తిరుపతి చేరుకుని పర్యటించడంతో అధికార యంత్రాంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బైరాగిపట్టెడ పార్క్‌లో పవన్



ఆసుపత్రి వద్ద జగన్

శవ రాజకీయాలు మానుకో భూమనా !

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ద్వార దర్శన టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం పరామర్శించారు. మీడియాతో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను విమర్శించే స్థాయి కరుణాకరరెడ్డికి లేదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజారెడ్డి, బీజేపీ నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహ యాదవ్

మృతుల కుటుంబాలకు బీసీవైపార్టీ ఆర్థిక సహాయం

పుంగనూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జరిగిన ఘటనలో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం ఆయన తిరుపతి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు బాధ్యులన్నారు. వెంటనే బోర్డును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసీపీ విధానాలనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగించడం వల్ల ఇలాంటి ఇబ్బందులు వస్తున్నట్లు ఆరోపించారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న రామచంద్ర యాదవ్

పుత్తూరు వార్తలు

వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన అప్పలాయగుంట



వడమాలపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పలాయగుంట లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆగమశాస్త్రం ప్రకారంగా తాత్కలికంగా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున శుక్రవారం వైకుంఠ నాథుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. . ప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పలాయగుంట పొలిమేరల్లోనే పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భక్తులకు ఇబ్బంది కలుగకుండా టీటీడీ ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 12.05 గంటలకు తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం ఉదయం 3.30 గంటలనుంచి రాత్రి 8 గంటలకు వరకు భక్తులు సర్వదర్శనం కల్పిస్తున్నారు. శనివారం ద్వాదశి రోజుల శనివారం ఉదయం 6.30-7.00 గంటల మధ్య శ్రీవారి చక్రస్నానం ఆలయంలోనే ఏకాంతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వడమాలపేట విశ్వవాణి స్కూల్‌లో పుత్తూరు వేదవ్యాస పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



పుత్తూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత మెయిన్ పాఠశాల, వేదవ్యాస విద్యా నికేతన్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. భోగిమంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, గొబ్బి పాటలను ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, వేదవ్యాస పాఠశాల కరస్పాండెంట్ బాలసరస్వతి, నారాయణబాబు, మంజుల పాల్గొన్నారు.

వడమాలపేట(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వవాణి స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ముగ్గులు వేశారు. విద్యార్థినులు భోగి మంటలు వేస్తూ గొబ్బెమ్మ పాటలు పాడారు. కరస్పాండెంట్ ధనంజయులు నాయులు తెలిపారు.

రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా పరమేశ్వరమంగళం

పుత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన పరమేశ్వరమంగళంలో రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి భూముల కొలతలు, రికార్డులలో నమోదై వున్న కొలతల్లో వున్న వ్యత్యాసాలు రీసర్వేతో తొలగిపోతాయన్నారు. గత నలభై ఏళ్లుగా సర్వే చేయకపోవడంతో సమష్టి కుటుంబాలలో భాగపరిష్కారాలు, క్రయవిక్రయాలు జరిగినా సరైన రీతిలో రికార్డుల్లో నమోదు కాకపోవడం, సరిహద్దులు చెరిగిపోవడంతో సమస్యలు ఎక్కువయ్యాయన్నారు. మండల సర్వేయరు శేషమరాజు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి శిక్షణ తరగతులు

పుత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు విద్యార్థులకు జరిగిన ఉపాధి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సురేంద్రరాజు మాట్లాడుతూ శిక్షణలో అంశాలను వినియోగించుకుని వృత్తిలో రాణించాలని కోరారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, నాందీ ఫౌండేషన్ శిక్షకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం

నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ఎంపీడీవో శేఖర్, సీడీపీవో శోభారాణి చెప్పారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసం సంబంధించి మండలస్థాయి శిక్షకులకు అవగాహన కల్పించారు. రక్తహీతన, బాలల అక్రమ రవాణా, వేధింపులు, రుతుక్రమ పరిశుభ్రత, సఖీ ఉమన్ హెల్ప్ లైన్, సఖి వన్ స్టాప్ సెంటర్, మహిళా మిత్ర, సైబర్ మిత్ర, నేరాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ప్రభాకర్ రాజు, ఏపీఎం మమత, ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి, మెడికల్ ఆఫీసర్ దర్శత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే



విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలను వివరిస్తున్న చంద్రమౌళి

పుత్తూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు డిగ్రీ కళాశాలలోని వివిధ కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి కోరారు. ఆరు జూనియర్ కళాశాల విద్యార్థులతో గురువారం డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్... భవిష్యత్తు లక్ష్యాలను ఎలా ఎర్పరచుకోవాలి, వివిధ కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయం, వ్యాయామశాల, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, కంప్యూటర్ లాబ్‌లను జూనియర్ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. పుత్తూరు బాలుర, బాలికలు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, గోపాలకృష్ణాపురం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సీఫల్ హెర్బల్‌లో ఉద్యాన విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గూడూరులోని సీఫల్ హెర్బల్ సంస్థను అన్నమయ్య జిల్లా కోడూరులోని అనంతరాజు పేట ఉద్యాన కళాశాలలో బీఎస్సీ నాలుగో సంవత్సర చదువుతున్న విద్యార్థులు గురువారం సందర్శించారు. అక్కడి నిమ్మ ఉత్పత్తుల తయారీని శాస్త్రవేత్త శ్యాం సుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నిమ్మ శుద్ధి, నిమ్మతో తైలం, పీచుతో పౌడర్ తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై సీఫల్ హెర్బల్ సంస్థ ఎండీ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ కాందర్‌నాయక్, కళాశాల ఏడీఆర్ డాక్టర్ హరి, మల్లికార్జున రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

ఎక్కువ లాభాలు వచ్చేలా చూసుకోవాలి

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు నిర్ణయాత్మక శక్తిని పెంపొందించుకోవాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చేలా చూసుకోవాలని ఏడీఏ నాగర్జునసాగర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లివేడు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులు వాడకం తగ్గించాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ఏవో సుజాత, ఏఈవో రామమోహన్, చెంచు భాస్కర్, రేఖ, శివకుమార్ పాల్గొన్నారు.

వేధింపుల టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

గూడూరు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం ఆరూరు జడ్పీఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలోని ఉపాధ్యాయురాలితో అభ్యంతర కరంగా వ్యవహరిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ నాయకుడు రాజా కోరారు. గురువారం స్థానిక డిప్యూటీ ఈవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతడి వేధింపులపై ఇప్పటికే ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో ఖర్చు తక్కువ



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో డ్రోన్‌లు వినియోగిస్తే ఖర్చు, సమయం ఆదా అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డ్రోన్‌లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ డ్రోన్ టెక్నాలజీతో ఎరువుల, పురుగు, తెగుళ్ల మందులు పిచికారి చేయవచ్చున్నారు. 8 నిమిషాల్లో ఎకరా పొలంలో పిచికారి చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగర్జునసాగర్, విజయశ్రీ, తిరుపాల్, రాజీవన రైతులు పాల్గొన్నారు.

గూడలిలో ముందస్తు వైకుంఠ ఏకాదశి



కోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడలిలోని భూదేవి, శ్రీదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో గురువారం రాత్రి ముందస్తు వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఉదయగిరి ఆది శేషాచార్యుల ఆధ్వర్యంలో జనార్ధన స్వామి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పునబాక సాగునీటి సంఘం అధ్యక్షుడు వేలూరు హరినాయుడు అన్నారు. గురువారం మండలంలోని పునబాకకండ్రిగ దళితకాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ నాయకులు తాళ్ల యుగంధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చిల్లకూరు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

చిల్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేశారు. గాలిపటాలు ఎగురవేశారు. విద్యార్థుల తల్లులకు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విశ్రాంత హెచ్ఎం కోదండ రామయ్య, హెచ్ఎం జాన్‌పీటర్, ఉపాధ్యాయులు చంద్రయ్య, శంకరయ్య, సులోచన, శ్రీనివాసులు, మల్లి కార్జున్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.







వైసీపీ పాలనలో గోతులమయంగా ఉన్న చెన్నూరు రోడ్డు ● కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో అభివృద్ధి పరిచిన అదే రోడ్డు, ప్రస్తుతం మళ్లీ కంకర తేలిపోయి ఉన్న అదే చెన్నూరు రోడ్డు

వీళ్లు మారరు అంతే..!

- మూన్నాళ్ల ముచ్చటగా చెన్నూరు రోడ్డు
- విస్తుపోతున్న ప్రయాణికులు

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు సంక్రాతి పండుగ లోపు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ప్రధాన రహదారులలో గోతులను పూడ్చేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే గూడూరు నుంచి రాజంపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టారు. గతేడాది నవంబరు 2వ తేదీన గూడూరు- రాజంపేట మార్గంలోని చెన్నూరు నుంచి తిప్పవరపాడు వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేరకు దెబ్బతిన్న ప్రధాన రాహదారిని అభివృద్ధి చేశారు. ఈ రెండు కిలోమీటర్లను బాగు చేయడానికి రూ.65లక్షలు మంజూరు చేశారు. డిసెంబరు 20వ తేదీలోగా పనులు పూర్తి చేశారు. వైసీపీ పాలన మొత్తం గుంతలతో అవస్థలు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు కూటమి ప్రభుత్వ చర్యలతో సాఫీగా ప్రయాణాలు సాగించారు. అయితే ఈ సాఫీ ప్రయాణం ఎంతోకాలం సాగలేదు. 21 రోజులు కూడా పూర్తికాలేదు. అప్పుడే రాళ్లు తేలి గుంతల మయంగా మారి పోయింది. రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించక పోవడం, పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల అభివృద్ధి మాట ఏమో గానీ, అభివృద్ధి పరచిన రోడ్డు సంక్రాంతి లోపే దెబ్బతిని తిరిగి అక్కడక్కడా రాళ్లు తేలి పోవడంతో 'పాలకులెవరైనా మారరు' అంతే అని జనం విస్తుపోతున్నారు.

నడిరోడ్డుపై నిలిచిన భారీ వాహనం

నాయుడుపేటలో వాహనచోదకుల అవస్థలు



నాయుడుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట -మేనకూరు సెజ్‌లోని ఓ కర్మా గారానికి చెన్నై నుంచి భారీ ట్యాంక్‌ను తీసుకువచ్చే లారీ గురువారం నాయుడుపేట - పాత వెంకటగిరి రహదారిపై నిలిచిపోయింది. కాలువపై నిర్మించిన ర్యాంప్, రోడ్డు సమాంతరంగా లేకపోవడంతో లారీ అక్కడ నిలిచిపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు పట్టణంలో ఇతర మార్గాల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పట్టణంలోని రోడ్లు గుంతలు తేలి అధ్వానంగా ఉన్నాయి. పట్టణానికి ఆనుకుని వెళుతున్న హైవే వచ్చాక పట్టణంలోని రోడ్లను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

ఘనంగా వివేకానందుడి జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆదిశేషారెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



కాంగ్రెస్ పార్టీ నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగురవం, వెంకటాచలపతి, రాజారెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.వెంకటాచలపతి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం విచ్చేశారు. తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కుటుంబంలో ఒకరికి టీటీడీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్దెపూడి రాజారెడ్డి, జానకిరామ్, పొన్నా మునస్వామి పాల్గొన్నారు.

చదువుతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న సీడీపీవో సంషాద్‌బేగం

డక్కిలి, జనవరి 8 : (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఆడబిడ్డా చదువుకోవాలని అప్పుడే బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడుతుందని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో సంషాద్ బేగం అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్లో వెలుగు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలకు కిషోరి వికాస్ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలపై అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ గోను రాజశేఖర్, వైద్యాధికారి బిందుప్రియ, వెలుగు ఏపీఎం జమున, సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

జగన్ తన బలగంతో వెళ్లడం సరికాదు

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్వర్ణముఖి ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు 200 మందితో వైసీపీ అధినేత జగన్ వెళ్లడం సరికాదన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి



సర్పంచ్ ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాల్ రెడ్డిపాళెం సర్పంచ్ నెల్లిపూడి పోలా ప్రసాద్ (37) గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి చాతిలో నొప్పిగా ఉండడంతో కుటుంబ సభ్యులు వెంటనే సూళ్లూరుపేటలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. సర్పంచ్ ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు సూళ్లూరుపేట మున్సిపల్ సమావేశం

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం గాంధ్లవీధిలోని శ్రీశక్తి భవనంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని కమిషనర్ చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలి పారు.

ముందస్తు సంకాంత్రి

సూళ్లూరుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాములమిట్ట పాఠశాలలో

తడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. గురువారం పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లుల పోటీ జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్ఎం ఉస్మాన్‌బాషా, ఎస్ఎంసీ చైర్మన్ మునిరాజ, గ్రామపెద్ద చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేపై అవగాహన ర్యాలీ

తడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూసర్వే ప్రాజెక్టుకు ఎంపికైన అక్కంపేట గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది. గురువారం తహసీల్దారు శరత్ బాబు ఆధ్వర్యంలో సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వేకు అందరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులపై శ్రద్ధతీసుకోవాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నారాయణరావు

కోట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సంక్రాంతి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లాకన్వీనర్ నారాయణరావు కోరారు. కోటలోని బీసీ బాలుర జూనియర్ కళాశాల, గురుకులాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు వెళ్లనున్న నేపథ్యంలో ఇంటివద్ద ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా తయారుచేయించిన దీపిక వర్షిణి పుస్తకాలను చదివించాలన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

పెళ్లకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ చిల్లకూరు సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం చిల్లకూరు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం..!

- మీ కాంట్రాక్టు బిల్లుల కోసం సమావేశాలా
- అడ్డగోలుగా ఆక్రమణ తొలగింపు అన్యాయం
- కౌన్సిలర్లును ప్రజలు నిలదీస్తున్నారు
- చైర్‌పర్సన్‌పై మండి పడ్డ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కౌన్సిలర్ కళ్యాణి

వెంకటగిరిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు ఏకపక్షంగా చైర్‌పర్సన్‌పై మండిపడ్డారు. బీఫాం తీసుకుంది వైసీపీ నుంచి అయితే టీడీపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారని వారిపై ధ్వజమెత్తారు. సమస్యలు పరిష్కరించలేక ప్రజలకు సమాధానం చెప్పుకోలేక వార్డులో తిరగలేని పరిస్థితి ఉందని విచారం వ్యక్తం చేశారు. మున్సి పాలిటీల కాంట్రాక్టు బిల్లుల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారే తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా చైర్‌పర్సన్, అధికారులు చొరవ చూపడం లేదని వైస్ చైర్మన్ బాలయ్య ధ్వజమెత్తారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. అనంతరం 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి మాట్లాడుతూ కౌన్సిల్‌కి చెప్పకుండానే టీచర్స్ కాలనీలో ఆక్రమణలు తొలగించడం అన్యాయ మన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో జంతు వధ శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని విన్నవించారు. మున్సిపాలిటీలో కోతులు, కుక్కలు, పందులు, ఆవుల బెడదను నివారించాలన్నారు. సచివాలయంలో ఎప్పుడూ సర్వర్ పనిచేయడం లేదని తెలియజేశారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎంపీ నారాయణ మాట్లాడుతూ 4వ వార్డులో కోట్ల విలువ చేసే భూములు రెవెన్యూ శాఖలో పెద్దాయన రాత్రికి రాత్రే మార్చేసి మాయచేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని కోరారు. 7వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లగా తమ వార్డులో ఏపనులు చేశారో లెక్క చూపాలని చైర్‌పర్సన్‌ను నిలదీశారు. చైర్‌పర్సన్ నుంచి స్పందన లేకపోవడంతో సమావేశాన్ని ఆయన బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిఫల్ ఇన్‌ఛార్జి కమీషనర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌తో వాగ్వాదం చేస్తున్న బాలయ్య

'టోకెన్' బాధితుల పరామర్శ కోసం పలువురి రాక

తిరుగు ప్రయాణమైన సీఎం, డిప్యూటీ సీఎం, మాజీ సీఎం

రేణిగుంట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ద్వాదశి టోకెన్ల కోసం వచ్చి మృతి చెందిన వారి కుటుంబీకులను, క్షతగాత్రులను పరామర్శించడానికి విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు మధ్యాహ్నం 1.20గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయం వెలుపల నుంచే ప్రత్యేక కాన్వాయ్‌లో స్విమ్స్‌కు బయలుదేరి వెళ్లారు. అలాగే డిప్యూటీ సీఎం మధ్యాహ్నం 3.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన స్విమ్స్‌కి వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే శ్రీనివాసులు, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కోటా వినుత, కిరణ్ రాయల్ ఉన్నారు. ఇక మాజీ సీఎం సీఎం జగన్ సాయంత్రం 5 గంటలకు తిరుపతి విమానాశ్రం చేరుకున్నారు. ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చెవిరెడ్డి తదితరులు ఆయనతో పాటూ స్విమ్స్‌కి వెళ్లారు. ఇక సాయంత్రం 7.45 గంటలకు సీఎం, రాత్రి 8 గంటలకు డిప్యూటీ సీఎం తిరుగు ప్రయాణమయ్యారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ


ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు పేద విద్యార్థులు చదువు కుంటున్నా రన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ సహకారంతో ప్రహరీ నిర్మాణానికి రూ.38.50 లక్షలు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డీవైఈవో ప్రభాకర్‌రాజు, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఎంఈవో యుగంధర్‌రాజు, హెచ్‌ఎం గిరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన... శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఆదిమూలం పిచ్చాటూరు పట్టణంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేసింది. నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డు సహా సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తారన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం

పిచ్చాటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్‌ని గుర్తిస్తే చికిత్సలతో లనివారించవచ్చని పిచ్చాటూరు వైద్యాధికారి హమీద్ తెలిపారు. ప్రతి ఒక్కరు పింక్ బస్సుల్లో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో గురువారం పిచ్చాటూరు పీహెచ్‌సీ పరిధిలోని కారూరు గ్రామ సచివాలయం, గోవర్ధనగిరిలోని విలేజ్ హెల్త్ సెంటర్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. 10న షంషేర్ బాదూర్‌పేట, పులికుంద్రం, 16న వెంగళత్తూరు, రామాపురంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. డాక్టర్లు హరిత, పద్మావతి, సర్పంచులు శివకృష్ణమనాయుడు, నారాయణమ్మ, కార్యదర్శి శాంతి తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌నాయుడికి పలువురి పరామర్శ


సతీష్‌నాయుడు కుటుంబీకులను పరామర్శిస్తున్న ప్రముఖులు

పిచ్చాటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు కుటుంబాన్ని గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి మాజీ ఎంపీపీ ప్రేమావతమ్మ ఈనెల 5న మృతి చెందిన విషయం విదితమే. ఈక్రమంలో శ్రీరాములునాయుడు, ప్రభాకర్‌నాయుడిని కూడా పరామర్శించి మాజీ ఎంపీపీ సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నారాయణస్వామినాయుడు, అశోక్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పిచ్చాటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు, విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని పిచ్చాటూరు మండల విద్యాశాఖ అధికారులు హేమమాలిని, యుగంధర్‌రాజు కోరారు. మండలంలోని ఉపాధ్యాయులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వరులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురగేష్, గురుప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అమ్ములు, మీనాకుమారి, జిల్లా నాయకులు షణ్ముగం, శేషారెడ్డి పాల్గొన్నారు.

ఏకాదశికి ముస్తాబైన కల్యాణ వెంకన్న ఆలయం

రేపు ద్వాదశి దర్శనం



నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైకుంఠ ఏకాదశి రోజున శుక్రవారం పద్మావతీ దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం టీటీడీ అధికారులు ఆలయంలో చలువ పందిళ్లు వేసి, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాల వితరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 5.00 నుంచి 6.30 గంటల వరకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి, 7 గంటల వరకు సర్వదర్శనం కల్పిస్తారని ఆలయాధికారి నాగరాజు తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆలయాలలో సాధారణంగా వైకుంఠ ఏకాదశి రోజునా వైకుంఠ ద్వారం తెరుస్తున్నారని, అయితే ఒక్క నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో మరుసటి రోజు అంటే ద్వాదశి రోజు వైకుంఠ వాకిలి తెరచి, భక్తులకు వైకుంఠ ప్రాప్తి కలుగు జేస్తారని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్ భట్టాచార్యా తెలిపారు. వైకుంఠ ద్వాదశి రోజు అనగా 11 వ తేది శనివారం వైకుంఠ ద్వారం తెరుస్తున్నారని, ఉదయం 8.40 గంటల నుంచి 11.30 గంటల వరకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు.

రేణిగుంట: మండలంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనం కల్పించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయాల్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. విద్యుదీపకాంతులతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి


ఆలయం వద్ద బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామిని గురువారం వెండి అంబారీ దాత బాలసుబ్రహ్మణ్యం దంపతులు దర్శించు కున్నారు. ఈయన గతంలో ఆలయానికి రూ.1.40కోట్లతో వెండి అంబారీలను అంద జేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.

వైద్య శిబిరం

రేణిగుంట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌మల్లవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాస్ ఆధ్వర్యంలో వైద్య ఉచిత శిబిరం జరిగింది. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ పేరుతో భారీ కుంభకోణం: సుధీర్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీ పేరుతో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఎమ్మెల్యే సుధీర్ ఆరోపించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని హౌసింగ్ లేఅవుట్‌లో గురువారం భూసేకరణ, ఇంటి పట్టాల పంపిణీపై విచారణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ ... మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తామని మభ్యపెట్టి ప్రజా ధనాన్ని గత పాలకులు లూటీ చేశారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఊరందూరు లేఅవుట్‌లో అత్యంత ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ ఇళ్ల నిర్మాణంపై మాత్రం చిత్తశుద్ధి చూపలేదన్నారు. భూసేకరణలో అప్పటి ఎమ్మెల్యే మధు పెద్దఎత్తున స్కాంకు పాల్పడ్డారన్నారు. అలాగే కాలనీలో రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల పేరుతో కోట్ల రూపాయలను స్వాహా చేశారన్నారు. అన్ని అంశాలపై అధికారులతో సమగ్ర విచారణ చేయించి నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. అనంతరం లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యే స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. కొందరు మహిళలు తమకు పట్టాలు ఇచ్చారుకానీ స్థలాలు చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మరి కొందరు లబ్ధిదారులు తమకు స్థలం చూపినా కానీ నిర్మాణానికి పనులు ప్రారంభించలేదని వాపోయారు. టీడీపీ నాయకులు చెంచయ్యానాయుడు, మునిరాజానాయుడు, కామేష్ యాదవ్, రవీంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు




జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులపై భోగిపళ్లు, ఎంజీఎం పాఠశాలలో భోగిమంటలు, వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సంబరాలు

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎల్‌బీనీకాలనీ సమీపంలో గల సెయింట్ జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు, భోగిమంటలు వేశారు. చిన్న పిల్లలకు భోగి పండ్లను పోశారు. తొట్టంబేడు యూనియన్ బ్యాంకు మేనేజరు విజయకుమార్, ప్రధానోపాధ్యాయురాలు షర్లి, ఉపాధ్యాయులు ఎంజీఎం పాఠశాలలో కూడా ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.

వరదయ్యపాళెం: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టను వివరించారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఉదయ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతిసంబరాలను గురువారం జరుపుకున్నారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతవీరాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కొత్తవీరాపుం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి.


పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో...

గిరిజనులకు ఎస్టీ కమిషన్ అండ


సమావేశంలో ప్రసంగిస్తున్న వడిత్యా శంకర్‌నాయక్

సత్యవేడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులను కాపాడడంలో రాష్ట్ర కమిషన్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని దాసుకుప్పం, కొత్త మారి కుప్పం, సత్యవేడు పంచాయతీల్లోని గిరిజన కాలనీల్లో వడిత్యా శంకర్ పర్యటించి గిరిజనుల సమస్యలపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేడు బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువరు గిరిజనులు విన్నవించారు. అదే సర్పంచు రమేష్, ఎంఈవో రవి, గూడూరు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి బేబీ రాణి, ఏఎస్‌డబ్ల్యూ కృష్ణ, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి


మిద్దెల హరికి సన్మానం

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన చేనేత కార్మిక యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్ఆర్ నేతన్న హస్తం పథకాన్ని ఎన్టీఆర్ నేతన్న నేస్తంగా పేరు మార్చి సంవత్సరానికి రూ.30వేలు ఇవ్వాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, షణ్ముగంవర్మ, వెంకటముని, హేమభూషణం పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ హరిత పాఠశాలగా నారాయణవనం బాలికోన్నత స్కూల్

నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ హరిత పాఠశాలగా బాలికల ఉన్నత పాఠశాలగా నారాయణవనం బాలికోన్నత పాఠశాల ఎంపికైంది. న్యూఢిల్లీకి చెందిన జీఎస్టీ ఆడిట్ 2024-25 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్‌లో మూడోసారి ఉత్తమ హరిత పాఠశాలగా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శశికళ, గ్రీన్ సమన్వయకర్త శ్యామలత తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మాతమ్మ ఆలయ హుండీ చోరీ

నాగలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్‌పురం ఆది ఆంధ్రవాడ మాతమ్మ ఆలయ హుండీ గురువారం చోరీకి గురైంది. ఆలయంలో ప్రతి రోజు కాలనీకి చెందిన వ్యక్తి పూజలు నిర్వహించే వారు. అదే విధంగా ఆ వ్యక్తి గురువారం ఉదయం యథావిధిగా ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లగా గేటుకు ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటం, అలాగే హుండీ కనిపించక పోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. చోరీపై విచారణ చేపట్టి దుండగులను పట్టుకోవాలంటూ నాగలాపురం పోలీసులకు " గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

పర్మిట్లు లేకుండా వాహనాలు నడపరాదు

కేవీబీపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పర్మిట్లు లేకుండా వాహనాలు నడపరాదని శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్‌నాయుడు చెప్పారు. గురువారం మండలంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు భారీ వాహనాలను సీజ్ చేసి, నాలుగు వాహనాలకు జరిమానా విధించారు. వాహనాలు రోడ్లపైకి వచ్చే సమయంలో తగిన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయురాలికి నివాళి

వరదయ్యపాళెం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేసి అంతర్ జిల్లా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు త్రివేణి రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని ఎంఈవో సరస్వతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో త్రివేణి మృతి పట్ల నివాళులు అర్పించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షులు శశికుమార్, కొండలరావు, వెంకటమోహన్, రుషేంద్రబాబు, ఉపాధ్యాయుల తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యంగా చేపట్టాలి

వరదయ్యపాళెం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు నాణ్యంగా చేపట్టాలని ఎంపీడీవో ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మరదవాడ పంచాయతీలో పల్లెపండుగలో భాగంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యదర్శి రాజశేఖర్, ఈవోపీఆర్డీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


మొక్కనాటుతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటకిందపల్లిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారణకు మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. జయప్రకాష్, దేవా, మల్లీశ్వరి, లోకేష్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ పంచాయతీ సర్పంచు చెక్‌పవర్ రద్దు

వరదయ్యపాళెం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో నిధులను దుర్వినియోగం చేసిన వైసీపీ సానుభూతి సర్పంచు సల్లా వీరభద్రయ్య చెక్‌పవర్ రద్దు చేస్తూ అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. 2018-23 మధ్య నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి నుంచి విచారణ సాగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణ వేగవంతం చేశారు. అంతేకాకుండా ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. గ్రామస్తురాలు ఆడిపూడి ఆశ కూడా పలుమార్లు ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాళహస్తి డీఎల్‌పీవో, సూళ్లూరుపేట డీఎల్‌పీవో సంయుక్తంగా విచారణ చేపట్టారు. దీంతో అవకతవకలు జరిగినట్టు గుర్తించి నివేదికను డీపీవో సుశీలదేవికి సమర్పించడంతో ఆమె గురువారం వీరభద్రయ్య చెక్‌పవర్‌ను మూడునెలల వరకు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనాలోచిత విధానాలకు భక్తుల బలి: వైసీపీ

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనాలోచిత నిర్ణయాలకు భక్తులు బలైయ్యారని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. ఏకాదశిన శ్రీనివాసుడి దర్శనానికి వ్యయప్రయాసలకు ఓర్చి వస్తే టోకెన్ల రూపంలో వారి ప్రాణాలు గాలిలో కలిశాయన్నారు.

కల్యాణ వెంకన్న సేవలో నందమూరి రామకృష్ణ



నారాయణవనం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మావతీ దేవి సమేత కల్యాణ వెంకన్న సేవలో దివంగత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కొనసాగిన అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండులో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా గురువారం కూడా 26వ వారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, తేజ, పేట చిరంజీవి, వెంకటరమణయాదవ్, లక్ష్మణ్, ప్రదీప్‌కుమార్, హేమంత్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.